పెడన పీహెచ్‌సీకి ఉపకరణాలు అందజేత

పెడన: పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ సహకారంతో అవేర గ్రూపు బుధవారం ఉపకరణాలను అందజేసింది. పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్‌హైదర్ మాట్లాడుతూ హైదరబాద్‌కు చెందిన అవేర గ్రూపు సుమారు రూ.2లక్షలు విలువ చేసే పలు ఉపకరణాలను ఆస్పత్రికి అందజేయడం అభినంద నీయమన్నారు. అవేర గ్రూపు ప్రతినిధి వాసు మాట్లాడుతూ అవేర గ్రూపు చైర్మన్ మాధవన్, ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్ ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీలకు ఉపకర ణాలను అందజేస్తున్నామన్నారు. హైడ్రాలిక్ బెడ్ కాట్స్ 2, వెయిటింగ్ చైర్స్ 3, ఇంజక్షన్ ట్రాలి 1, స్టాడింగ్ బీపీ మిషన్లు 2, ఎయిర్‌కూలర్లు 2, సోలార్ లైట్లు 2, కుర్చీలు 30, అల్మారాలు 2 అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, సరుకులు

నాగాయలంక: అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి మాదివాడ రాము, దీవి పద్మావతి(గ్రేడ్-6 గ్రామ కార్యదర్శి అశ్వారావుపాలెం)ఆర్థిక సౌజన్యంతో స్థానిక వృద్ధుల ఆశ్రమానికి బుధవారం నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు సాయం చేశారు. పద్మావతి పుట్టినరోజు పురస్కరించుకుని అందజేశారు. ఆశ్రమ ప్రతినిధి కనిగంటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు

గూడూరు: గూడూరులో ఈ నెల 13 నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు గూడూరు డీసీ చైర్మన్ పోతన వెంకటలక్ష్మి నరసింహస్వామి తెలిపారు. దీనికి సం బంధించిన కరపత్రాన్ని బుధవారం గూడూరులో ఆవిష్కరించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో నిర్వహించే పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని స్వామి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పోతన రామోజీ, గంజాల వేణుగోపాలరావు, కోలపల్లి రజని తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన గాంధీక్షే త్రంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పింఛనర్ల ఇళ్లకు వైద్య బృందాలు



పెడన: పురపాలక సంఘ పరిధిలో మంచంపై ఉంటూ కదల్లేని స్థితిలో ఉన్న రూ.15వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం పరిశీలించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం సిబ్బందితో పాటు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ కె.సాయిప్రీతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వీరి వెంట ఉన్నారు. గుంటూరు జీజీహెచ్ నుంచి డాక్టర్ శ్రీకాంత్, విజయవాడ జీజీహెచ్ నుంచి డాక్టర్ పూర్ణిమ ఆయా పింఛను లబ్ధిదారులను పరిశీలించి నివేదికలను సిద్ధం చేసుకున్నారు. ఈసందర్భంగా మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో బెడ్‌పై ఉంటూ రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారు 25 మంది ఉన్నారని, వీరందరిని వైద్య బృందం పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తోందన్నారు.

18న రేషన్‌షాపుల భర్తీకి రాతపరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రేషన్ షాపుల నిర్వహణకు ఈ నెల 18వ తేదీన రాతపరీక్షలు జరుగుతాయని బందరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. 20వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను ఈ నెల 16, 17 తేదీల్లో కార్యాలయ పనివేళల్లో బందరు ఆర్డీవో కార్యాలయంలో పొందాలని సూచించారు. హాల్‌టిక్కెట్లలో రాతపరీక్షకు సంబంధించిన కేంద్రం, మౌఖిక పరీక్ష కేంద్రం వివరాలు పొందుపరిచారని తెలిపారు.

బౌద్ధ మ్యూజియం సందర్శన

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో బౌద్ధ స్థూపం, మ్యూజియాన్ని ప్రవాస భారతీయులు మూల్పూరి వెంకట్రావు, ఏపీ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ మ్యూజియంలో క్రీ.శ. 2, 3 శతాబ్దాల్లోని బౌద్ధ శిల్ప సంపద, స్థూపాన్ని పరిశీలించారు. ప్రాచీన కాలంలో ఘంటసాల పరిసర ప్రాంతాల్లో బౌద్ధం విరాజిల్లిందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ వారికి తెలియజేశారు. అనంతరం ఘంటసాల, దేవరకోట గ్రామాల ఇలవేల్పు శ్రీకోట ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఏసీఎస్‌లో నిధుల గోల్‌మాల్..

ముచ్చర్ల సంఘంలో ఉద్యోగి సస్పెన్షన్

పెడన: మండల పరిధిలోని ముచ్చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి(పీఏసీఎస్) సంఘంలో నిధులు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఆ సంఘ కార్యాలయంలో సీఈఓ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ – గతంలో కార్యదర్శిగా పిలిచేవారు)గా విధులు నిర్వహించే చందన మధుబాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనలో గతేడాది నుంచి రైతులు తీసుకున్న రుణాలు రికవరీకి సంబంధించి పెడనలోని కేడీసీసీ బ్యాంకులో జమ చేయకుండా ఆ నగదును పక్కదారి పట్టించాడు. సుమారు రూ.30 లక్షలు వరకు నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లోని రుణాలు తీసుకుని తిరిగి చెల్లించిన రైతులు కొందరు గొడవకు దిగడంతో వారికి సర్దుబాటు చేసి రికవరీలను చెల్లించాడు. తిరిగి చెల్లించినా గొడవ చేయని మరికొందరి రైతులు పరిస్థితి ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏఏ రైతుల నుంచి ఎంత రికవరీ చేసింది, పూర్తి వివరాలను తెలియకుండా అధికారులు గోప్యంగా ఉండటం పట్ల రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు ఉద్యోగి తిరిగి రూ.20 లక్షలకుపైగా చెల్లించగా మిగిలిన మొత్తం ఇక చెల్లించలేనని చెప్పడంతో చేతులకు మట్టి అంటకుండా ఉండటానికి ఉన్నతాధికారులు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయమై పెడన కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వి.సాయిబాబు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా నగదు సక్రమంగా చెల్లించకపోవడంపై ఆరా తీసి పలుమార్లు నోటీసులు ఇచ్చామన్నారు. సుమారు రూ.14 లక్షలు వరకు ఉంటే రూ.6 లక్షలు కట్టారని, ఇంకా చెల్లించకపోవడంతో మధును మూడు రోజుల కిందట సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించామని తెలిపారు.



ముచ్చర్ల పీఏసీఎస్

సకల సౌకర్యాలు కల్పించండి

కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని మంగినపూడిబీచ్‌లో యాత్రికులకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగినపూడిబీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి యాత్రికులకు కనీస సౌకర్యాల ఏర్పాటులో భాగంగా బయోటాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఏర్పాటుకు జిల్లా టూరిజం కౌన్సిల్ ద్వారా అవసరమైన టెండర్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. మంచినీటి అవసరాల కోసం ఉప్పునీటిని మంచినీటిగా మార్చే డీసాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు అవసరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. బందరుకోటలో హెరిటేజ్ పార్కు ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. పోతేపల్లి పారిశ్రామికవాడలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన అధికారులతో చర్చించారు. మూడు స్తంభాల సెంటరు సమీపంలోని మడుగు పోరంబోకు భూమి అభివృద్ధి ఎలా అభివృద్ధి చేయాలో కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో బందరు ఆర్డీవో కె.స్వాతి, డ్వామా పీడీ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, జిల్లా పర్యాటక అధికారి రామలక్ష్మణరావు, పరిశ్రమలశాఖ జీఎం ఆర్.వెంకట్రావు, సర్వే ఏడీ జోషిల, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరేష్‌కుమార్, తహసీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణంగా భావిస్తున్న పోలీసులు



అడపాల రవి కుమార్(ఫైల్)

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ వడ్డీ వ్యాపారి దారుణంగా హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు గల కారణంగా పోలీసులు భావిస్తున్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసిన చిలకలపూడి పోలీసులు హంతకుల కోసం గాలిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం చిలకలపూడికి చెందిన అడపాల రవి కుమార్(50) వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. ఘంటసాలకు చెందిన టి.శ్రీను అనే లారీడ్రైవర్ రవికుమార్ వద్ద తరచూ అప్పు తీసుకుంటూ, తిరిగి చెల్లించేవాడు. కొంతకాలంగా శ్రీను తీసుకున్న అప్పు చెల్లించకపోగా వడ్డీ సైతం కట్టడం లేదు. దీంతో రవికుమార్ వడ్డీ డబ్బుల కోసం శ్రీను ఇంటికి వెళ్తుండేవాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వివాదం జరుగుతుండేది. దీనికి తోడు శ్రీను భార్యతో రవికుమార్ చనువుగా మాట్లాడుతుండేవాడు. శ్రీను ఇంట్లో లేని సమయంలో డబ్బుల కోసం రవికుమార్ తరచూ అతని ఇంటికి వెళ్తుండటంతో ఆగ్రహానికి గురైన శ్రీను అనేక మార్లు రవికుమార్‌తో గొడవ పడ్డాడు. అయినా రవికుమార్ ఇంటికి వెళ్లటం డబ్బులు అడగటం ఆపకపోవటంతో విసుగుచెందిన శ్రీను ఎలాగైనా రవికుమార్‌ను అంతమొందించాలనుకున్నాడు.

పథకం ప్రకారమే హత్య..

రవికుమార్‌ను అంతమొందించాలనుకున్న శ్రీనుకు డ్యూటీలో పరిచయమైన చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన స్నేహితులు(లారీ డ్రైవర్లు) వంశీ, శివలతో మాట్లాడి తనకు సహకరించాలని కోరాడు. ఈ ముగ్గురూ పెడన రోడ్డులోని కోతిబొమ్మసెంటర్‌లో ఉన్న ఓ బడ్డీకొట్టులో పూటుగా మద్యం సేవించారు. పథకం ప్రకారం శ్రీను కత్తి వెంటబెట్టుకుని మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో చిలకలపూడిలోని రవికుమార్ ఇంటి వద్ద పికెటింగ్ నిర్వహించారు. రవికుమార్ బైక్ వరండాలో లేకపోవటంతో అతను ఇంటికి రాలేదని నిర్ధారించుకున్నారు. అతన్ని హత్య చేసేందుకు నిర్ణయించుకున్న ముగ్గురు చుట్టుపక్కల ఎలాంటి ఆధారాలు లేకుండా చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాల వైర్లను కత్తిరించారు.



హత్య చేసే ముందు పెడన రోడ్డులోని ఓ బడ్డీ వద్ద మద్యం సేవిస్తున్న హంతకులు

చికిత్స పొందుతూ మృతి..

దాదాపు గంటకుపైగా ఎదురుచూసిన శ్రీను అతని ఇద్దరు స్నేహితులు రవికుమార్ బైక్ వస్తుండటం గమనించారు. రవి కుమార్ ఇంటి ముందర ఆగి బైక్ లోపలికి తీసుకువెళ్లి స్టాండ్ వేస్తుండగా ముగ్గురు ఒక్కసారిగా కత్తితో విచక్షణారహితంగా పొడిచారు. దీంతో రవికుమార్ కాలేయం, మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కత్తిపోట్లకు రవికుమార్ బిగ్గరగా కేకలు వేయటంతో ఇంట్లో ఉన్న అతని కుమార్తె ధాత్రి తలుపులు తీసి చూస్తుండగా ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. రవికుమార్ రక్తపు మడుగులో కనిపించాడు. తండ్రిని చూసిన కుమార్తె బిగ్గరగా ఏడుస్తుండగా ధైర్యం చెప్పిన రవికుమార్ బైక్ తీసుకుని సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. బంధువులు తలుపు తీసి చూడగా రవి కుమార్ జరిగిన విషయాన్ని చెప్పి తనను ఆసుపత్రికి తీసుకువెళ్లి బతికించమని ప్రాధేయపడ్డాడు. రవికుమార్‌ను బంధువులు హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందాడు. జరిగిన సంఘటనపై మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా హంతకుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నబీ తెలిపారు.

మార్కెట్లోకి మధురఫలం



మచిలీపట్నంలో మామిడి పండ్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మార్కెట్లోకి మధుర ఫలం మామిడి వచ్చింది. మామిడి చెట్లకు ప్రస్తుతం పూత కనిపిస్తున్న దశలో ఏకంగా పండ్లు మార్కెట్లోకి రావడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ మామిడిపండ్ల విషయమై వ్యాపారులను అడిగితే వీటిని ఉలవపాడు ప్రాంతం నుంచి తీసుకొచ్చినట్లుగా చెబుతున్నారు. ఇవి పైరు పంట కాయలని వివరించారు. కిలో మామిడి పండ్ల ధర రూ. 250గా విక్రయిస్తున్నారు. నగర శివారులోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ ప్రాంతంలో మచిలీపట్నం, విజయవాడ రోడ్డు మార్జిన్‌లో వీటిని విక్రయిస్తున్నారు. వీటిని పలువురు వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీకాకుళం(ఘంటసాల): అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు సమన్వయంతో శ్రీకాకుళం డీసీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో బుధవారం శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటర్ కమిటీ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో ఇరిగేషన్ ఏఈఈ తానేటి ప్రసాద్ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఆయా నీటి సంఘాల అధ్యక్షులు తమ పరిధిలోని పంట కాల్వలు, డ్రైయిన్ల సమస్యలపై వివరించారు. ఘంటసాల 188 నీటి సంఘం 12వ మెంబర్ వేమూరి శివరామకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల మండలం పరిధిలోని 3/2 ఛానల్ పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ తూములను తొలగించాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైయినేజీ డీఈ జె.బాబూనాయక్‌లు మాట్లాడుతూ ఆయా నీటి సంఘాల అధ్యక్షులు చెప్పిన సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించి మీతో కలసి పరిశీలించామని, వాటి పరిష్కారానికి అంచనాలు తయారుచేసి పంపిస్తామన్నారు. ఆయా సంఘాల పరిధిలో శిస్తు వసూళ్లు వేగంగా జరిగేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. దీంతో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశముందని చెప్పారు. అనంతరం డీసీ చైర్మన్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు, నీటి సంఘాల అధ్యక్షుల సమన్వయంతో శ్రీకాకుళం డీసీ పరిధిలోని కాల్వలు, డ్రైనేజీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం రూ.89.48 లక్షలతో శ్రీకాకుళం డీసీ పరిధిలోని యనమలకుదరు నుంచి నిమ్మగడ్డ లాకుల వరకు ఉన్న కేఈబీ కెనాల్, 2, 3, 4, 5 నంబర్ల కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడ, నాచు, గూబీ తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో డీసీ వైస్ చైర్మన్ సుగ్గుణ రాంబాబు, డ్రైయినేజీ ఏఈ జె.చిరంజీవి, 184 రొయ్యూరు, 185 వల్లూరిపాలెం, 186 ఐలూరు, 187 శ్రీకాకుళం, 188 ఘంటసాల, 189 పాపవినాశనం, 190 చిట్టూర్పు, 191 వక్కలగడ్డ నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్, డ్రైయినేజీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్తరద్వార దర్శన ఏర్పాట్లు

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వర ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను ఆలయ ఈవో వర ప్రసాదరావు బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న శుక్రవారం ఉదయం 4 గంటలకు సుప్రభాతం, శ్రీ స్వామి వారికి, అమ్మ వార్లకు సహస్ర నామార్చన అనంతరం తీర్థ ప్రసాద వినియోగం, ఉదయం 10.08 గంటలకు శ్రీస్వామి వారు, అమ్మ వార్ల ఆస్థాన పూజ, ఉదయం 11.16 గంటలకు శ్రీ స్వామి వారు, అమ్మ వార్ల ఉత్తర ద్వారా దర్శనం, గరుడ వాహనం పై గ్రామోత్సవం, మధ్యాహ్నం 1 గంటలకు తీర్థ ప్రసాదాలు, గ్రామస్తుల సహకారంతో అన్నసమారాధన, రాత్రి 8 గంటలకు రాజాధిరాజం పై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడికొండ చిన్నా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



భూ సమస్యలు తీర్చడానికే..

అడపవారిపాలెం(మోపిదేవి): భూ సమస్యలకు సంబంధించి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులతో పరిష్కారానికి శ్రీకారం చుట్టిందని మండల రెవెన్యూ సదస్సు ప్రత్యేక అధికారి పి.విష్ణు తెలిపారు. మండలంలోని అడపవారిపాలెంలో సచివాలయం వద్ద సర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అధికారి విష్ణు మాట్లాడుతూ గత డిసెంబరు 6 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో వివిధ సమస్యలపై 85 అర్జీలు అందాయని, వాటిని ఆన్‌లైన్ చేసి 58 అర్జీలకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. మిగిలిన 33 అర్జీలపై విచారణ చేసి పరిష్కరిస్తామని వివరించారు. తహసీల్దార్ శ్రీవిద్య మాట్లాడుతూ చివరిరోజు తలపుల విజయలక్ష్మికి చెందిన పొలం పాస్‌బుక్‌లో ఎక్కువగా ఉందని, దాని సరిచేయాలని కోరినట్లు తెలిపారు. మండల సర్వేయర్ రామకృష్ణ బాబు, డీటీ వాణీ, ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వో వేణు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడూరు: ముక్కొల్లు సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ టి.రాధ, వీఆర్వో సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు ఆరోగ్యకరమైన, పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎంపీ, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. స్థానిక హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన విద్య, ఆటల పోటీలను బుధవారం ప్రారంభించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జనసేన నేత బండి రామకృష్ణతో కలసి కొనకళ్ల.. జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహద పడతాయన్నారు. పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ విద్యార్థుల్లో శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడా పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. వీర్నాల ఫౌండేషన్ చైర్మన్ వీర్నాల బాలాజీ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో 5,500 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. విజేతలకు 10వ తేదీ సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీవై ఈవో శేఖర్ సింగ్, హిందూ కళాశాలల అనుబంధ సంస్థల కార్యదర్శి డీజీ శాస్త్రి, వీర్నాల నాంచారయ్య, మానస, పోతరాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

కోడూరు: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ కోరారు. మండలంలోని పిట్టల్లంక పంచాయతీ పరిధిలో బుధవారం నుంచి భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని, భూముల హద్దులు కచ్చితంగా తెలియడంతో పాటు సరిహద్దుల వివాదాలకు తావుండదని తహసీల్దార్ తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు జిరాక్స్‌లతో స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, వాటి ఆధారంగా సర్వే ఉంటుందన్నారు. తొలత పిట్టల్లంకలో సర్వే జరుగుతుందని, తర్వాత మిలిగిన పంచాయతీల్లో కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం రీసర్వేకు సంబంధించిన గ్రామసభను జరిపి, ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ పద్మప్రియ, ఆర్‌ఐ సుభాషిణి, వీఆర్వో గోపాలకృష్ణ, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

పెడన: నాటు సారా తయారు చేసినా రవాణా జరిగినా.. అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ భార్గవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని దక్షిణ తెలుగు (డీటీ)పాలెం, నందమూరు గ్రామంలో నాటుసారాతో జరిగే అనర్థాలు, కేసులు, ఆరోగ్య సమస్యల తదితర వాటిపై గ్రామస్తులకు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ మాట్లాడుతూ నాటు సారాతో తీవ్ర అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని, వాటి జోలికి పోవద్దన్నారు. నాటు సారా తయారుచేసే వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని మానుకుంటే పునరావాసం ఏర్పాటుచేస్తామని దీనికి కమిటీలు కూడా వేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ దక్షిణ తెలుగుపాలెం దత్తత తీసుకుంటామని, ఎవరైనా నాటు సారా తయారు చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రవి, కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, వీఆర్వో నాగాంజనేయులు, నందమూరు గ్రామస్థులు, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాలలో పండుగ కోలాహలం



సంక్రాంతి హరివిల్లు ముగ్గును ఆవిష్కరించిన బాలికలు

నాగాయలంక: స్థానిక విద్యాభారతి పబ్లిక్ పాఠశాల ఆవరణలో బుధవారం బాలికలకు నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీ సందడిగా సాగింది. ముగ్గుల పోటీలను తొలుత పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రత్నారావు ప్రారంభించారు. సంక్రాంతి విశిష్టత, పండుగ సంప్రదాయాల ప్రాముఖ్యాన్ని పిల్లలకు వివరించారు. పోటీలో 4 నుంచి పదో తరగతి వరకు 150 మంది బాలికలు పాల్గొని ముగ్గులను తీర్చిదిద్దారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆలూరి చైతన్య, చందు శిరీష, కె.లంకేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు గురువారం జరిగే సంక్రాతి సంబరాల వేడుకలో బహుమతులు అందజేస్తామని అకడమిక్ డైరెక్టర్ ఎ.వి.శేషుబాబు చెప్పారు. రాధాకృష్ణమూర్తి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కామ్రేడ్ ఆదిశేషు మృతి

మోపిదేవి: సీపీఎం నేత కామ్రేడ్ బండి ఆదిశేషు(62) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణం కోసం సీపీఎం ఆధ్వర్యంలో 13 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అస్వస్థతకు గురై ఇంటికి చేరున్న ఆయన అర్ధరాత్రి గ్యాస్ట్రిక్ సమస్యతో ఇబ్బంది పడటంతో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు నివాళులర్పించారు.

శబరిమల యాత్రలో విషాదం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామానికి చెందిన ఆకుల నాగ విజయబాబు(42) శబరిమలైలో బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. అయ్యప్ప మాల ధరించిన ఆయన గత సోమవారం శబరిమలై వెళ్లారు. మరి కొద్ది గంటల్లో స్వామివారి దర్శనం చేయబోయే సమయంలో కాలినడకన వెళ్తున్న విజయ్‌కు గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు తోటి అయ్యప్పలు సమాచారం తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య యమున, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

మల్లంపల్లి(ఘంటసాల): బాల్య వివాహాలతో అనర్థాలు జరగడమే కాకుండా భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సి వస్తుందని పలువురు వక్తలు తెలిపారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడానికి మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఘంటసాల మండలం మల్లంపల్లి, ఘంటసాల జెడ్పీ హైస్కూల్స్‌లో బుధవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా హైస్కూల్స్‌లో పలువురు మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎంలు ఎం.మంజుకుమారి, సీహెచ్ వంశీకృష్ణ, అంగన్వాడీ టీచర్లు జె.చిన్నారి, అరుణ, నాగమోహిని, రజిని, ప్రమీల, నాగలక్ష్మి, మునెమ్మ, బలే పద్మ, నాగమణి, క్రాసా ప్రతినిధి టి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

నాగాయలంక: ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకుని స్థానిక శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్త విశాలక్షి పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో బుధవారం గోదాదేవికి భక్తిశ్రద్ధలతో విశేష పూజను నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయంలోని శ్రీరుక్మిణి, శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజ, విశేష అలంకారం చేశారు. గోదాదేవి పీఠం వద్ద ఆలూరి శ్రీనివాసరావు, వెంకట ధనలక్ష్మి దంపతులు పీటలపై కూర్చోగా గోదాదేవి, రంగనాథస్వామి, ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

పెడన: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు బుధవారంతో 24వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆండాళ్ళ గోష్ఠి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి పంచహారతులు ఇచ్చారు.



జూనియర్ కళాశాలకు బోరింగ్ పంపు వితరణ

పెడన: పట్టణంలోని శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీవిద్యార్థుల తాగునీరు సౌకర్యార్థం పేరిశెట్టి నాగేంద్రం, కోటపైడమ్మ దంపతుల జ్ఞాపకార్థం వీరి కుమారుడు నాగరవి కళాశాల ఆవరణలో బోరింగ్ పంపును ఏర్పాటు చేశారు. దీన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ కేసీఎస్వీఎస్ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సమయంలో తాగునీటిని వినియోగించుకునేందుకు లైబ్రరీ అధ్యాపకుడు నాగరవి తన తల్లిదండ్రుల గుర్తుగా బోరింగ్ పంపును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కట్టా వెంకట నాగేశ్వరరావు, వి. నిరంజనరావు, సైదా, గంగాధర్, గిరి, వెంకన్న, రాజ్యలక్ష్మి, మధులత తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిలో దూసుకెళ్తున్న చల్లపల్లి

చల్లపల్లి(అవనిగడ్డ): జిల్లా కేంద్రం మచిలీపట్నంకు, అవనిగడ్డకు మధ్యలో ఉన్న చల్లపల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. యార్లగడ్డ మంతురాజా సంస్థానాధీశుల రాజరికంతో పేరు ప్రఖ్యాతలు నొందిన చల్లపల్లి విద్య, వైద్య, వ్యాపారపరంగా అభివృద్ధిలో ముందుకెళుతోంది. 40 గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉన్న చల్లపల్లి అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోంది. చల్లపల్లి రాజా కోట పర్యాటకంగా ఎంతో ఆదరణ పొందింది. అవనిగడ్డ నియోజకవర్గంలో చల్లపల్లి పట్టణం వాణిజ్య కేంద్రంగా వెలుగొందుతోంది.



చల్లపల్లిలోని ప్రధాన సెంటర్

విద్యారంగంలో అగ్రగామి

చల్లపల్లి పట్టణం విద్యారంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. విజయ జూనియర్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, సెయింట్ మదర్‌థెరిస్సా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, నాగార్జున హైస్కూల్, శ్రీ విజయ అకాడమీ, విజయ క్రాంతి విద్యాసంస్థలు స్థానికంగా విద్యా ప్రగతికి బాటలు వేస్తున్నాయి.

వైద్య రంగానికి ప్రత్యేకం

ఒకప్పుడు ఏ అనారోగ్య సమస్య ఉన్నా ప్రజలు జిల్లా కేంద్రమైన మచిలీపట్నం, విజయవాడకు వెళ్లాల్సి వచ్చేది. చల్లపల్లిలో ఏర్పాటు చేసిన పలు వైద్యశాలలు అధునాతన వైద్యసేవలు అందిస్తున్నాయి. పాముకాటు, పాయిజన్ కేసుల రికవరీకి చల్లపల్లి వైద్యశాలలు పెట్టింది పేరు. కార్పొరేట్ తరహాలో నెలకొల్పిన కీర్తి హాస్పటల్‌లో షుగర్ వ్యాధికి ఆధునిక వైద్యంతో పాటు పాయిజన్, కిడ్నీ, గుండె, మెదడు వ్యాధులకు వెంటిలేటర్‌తో కూడిన అత్యాధునిక ఐసీయూ సేవలు అందిస్తున్నారు. శ్రీకృష్ణ పిల్లల వైద్యశాల పిల్లలకు ఆధునిక వైద్యసేవలు చేస్తోంది. ఇక్కడి వైద్యశాలలు పేదలు, సామాన్యులకు అందుబాటులో వైద్యసేవలు అందిస్తున్నాయి.

వర్తక వాణిజ్యంలో మేటి

వేలాది మందికి కేసీపీ చక్కెర కర్మాగారం జీవనోపాధి కల్పించింది. నియోజకవర్గంలో వర్తక, వాణిజ్య కేంద్రంగా చల్లపల్లి పట్టణం పేరుగడించింది. మండంలోని వక్కలగడ్డ మధురం హోం ఫుడ్స్ స్వచ్ఛమైన పిండివంటలు, ఆహార పదార్థాలను విదేశాలకు ఎగుమతి చేస్తూ మహిళాభ్యుదయానికి పాటుపడుతోంది. ఆక్వా, మత్స్యరంగానికి కోస్టల్ సీఫుడ్స్ నాణ్యమైన మేతను అందిస్తూ ఆక్వారంగ అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. పట్టణంలోని పలు జ్యూయలర్స్ షాపులు విజయవాడకు తీసిపోని విధంగా వినియోగదారుల మన్ననలు పొందుతున్నాయి.

ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి



ఇప్పుడు చల్లపల్లిలోనే వెంటిలేటర్, ఆధునిక ఐసీయూ సేవలు అందుబాటులోకి వచ్చాయి. షుగర్, కిడ్నీ, గుండె, మెదడు సంబంధిత సమస్యలతో పాటు పాయిజన్ కేసులకు ఆధునిక వైద్యసేవలు చెంతనే ఉన్నాయి. పిల్లలు లేనివారికి ఇన్‌ఫెర్టిలిటీ, ఐయూఐతో పాటు హైరిస్క్ ఆపరేషన్లు ఇక్కడే జరిగిపోతున్నాయి.

–డాక్టర్ నల్లపనేని కీర్తి, కీర్తి హాస్పటల్



చల్లపల్లి రాజాకోట



విజయ జూనియర్ కళాశాల

దేశానికే ఆదర్శనీయం.. స్వచ్ఛ చల్లపల్లి

చల్లపల్లిలో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లితో పట్టణంలో పచ్చనిచెట్లు, పరిశుభ్రత పెరిగింది. డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతుల సారథ్యంలో ఎంతో మంది స్వచ్ఛ సైనికులు నిరంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో చల్లపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ముఖ్యంగా శ్మశాన వాటికను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం పచ్చని మొక్కలతో ఆకట్టుకుంటోంది. బస్టాండ్, పట్టణం చివర వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలో నిర్మించిన టాయ్‌లెట్స్ పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యం పెంపొందించేలా ఉన్నాయి. స్వచ్ఛ సైనికులు ప్రతిరోజూ తెల్లవారుజామున చేపడుతున్న పరిశుభ్రత పనులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.



పచ్చదనంతో చల్లపల్లి రహదారులు